క్లుప్తంగా

ప్రాజెక్టుల నిర్వహణతో ప్రతిభను గుర్తించొచ్చు



భారతదేశ పటాన్ని చూపిస్తున్న విద్యార్థులు

మోమిన్‌పేట: ప్రాజెక్టుల నిర్వహణతో విద్యార్థుల ప్రతిభ గుర్తించొచ్చని ఉపాధ్యాయుడు అరుణ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వెల్‌చాల్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు భారతదేశం–భౌగోళిక స్వరుపం ప్రాజెక్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం బొమ్మను గీసి భౌగోళిక స్వరుపాలను గుర్తించారన్నారు. దేశంలోని వనరులు, నదులు, పీఠభూములు, హిమలయాలు, సముద్రాలు మ్యాప్ సహాయంతో చూపించారు. ఈ విధానంతో బోధించిన పాఠంపై పూర్తి అవగాహన వస్తుందన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు చేయడంతో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామాను కార్యదర్శి సిద్దమ్మకు అందజేస్తున్న అశోక్‌ముదిరాజ్

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి శనివారం లింగనపల్లి అశోక్‌ముదిరాజ్ రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నాయకుడు పట్లోళ్ల రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీకి 23 సంవత్సరాల పాటు విశేష సేవలందించి, పలువురు ఎమ్మెల్యేల విజయానికి పాటుపడ్డారన్నారు. ఐనప్పటికీ ఎలాంటి గుర్తింపు లేకుండా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఏ పదవి ఇవ్వకుండా, ఉన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవిని తొలగించి అన్యాయం చేశారన్నారు. రఘువీరారెడ్డికి ఏ పదవి ఇవ్వకపోవడంతో మనోవేదనకు గురై రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ డైరెక్టర్ పదవికి రాజీనామ చేయకపోవడం గమనార్హం.

బృంగీ ఇంటర్నేషనల్ పాఠశాలకు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న ఎంఈఓ గోపాల్

పరిగి: పట్టణ కేంద్రంలోని బృంగీ ఇంటర్నేషనల్ పాఠశాలలో నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండడంతో శనివారం మండల విద్యాధికారి గోపాల్ నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో నోటుపుస్తకాలు, పాఠ్య పుస్తకాలు విక్రయించడం నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లోనే ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి లాభాలకు విక్రయిస్తున్నారని పలువురి నుంచి అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్ని తరగతులకు అనుమతులు ఉంటే అన్ని తరగతుల వరకే అడ్మిషన్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఎంపీడీఓ గ్యామా

దోమ: నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని దోమ మండల ఎంపీడీఓ గ్యామా పేర్కొన్నారు. శనివారం దోమ మండలం శివారెడ్డిపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. మొక్కలు నాటేందుకు గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకాన్ని బాధ్యతగా భావించాలని కోరారు. ప్రతీ గ్రామంలోని నర్సరీలో పదివేల మొక్కలను పెంచేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

కేశంపేట: రోడ్డును ఆక్రమిస్తూ నిర్మిస్తున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ కొత్తపేట శాస్త్రీపురం కాలనీవాసులు శనివారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశా రు. 2వ వార్డులో ఉన్న శాస్త్రీపురం కాలనీకి వచ్చే సీసీరోడ్డును ఆక్రమిస్తూ ఓ వ్యక్తి నిర్మా ణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణా ల కారణంగా రోడ్డు విస్తీర్ణం తగ్గడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయని వారుపేర్కొ.

తడిసి.. మోపెడు!



పిల్లలకు అవసరమయ్యే వస్తువులను కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు

పెట్టుబడుల మాసం

- వ్యవసాయ పనులు, పాఠశాలల ప్రారంభంతో తప్పని సమస్యలు
- మధ్య తరగతి కుటుంబాలకు కష్టమే
- పెరిగిన ఆర్థిక భారం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు
- అప్పులు చేస్తున్న ప్రజలు

దుద్యాల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. ముఖ్యంగా వ్యవసాయ పనులతో పాటు పాఠశాలల ప్రారంభం జూన్ నుంచే మొదలవుతాయి. రైతులకు కూడా మొదటి వారం నుంచి పెట్టుబడి, పిల్లల చదువుల కోసం అన్ని రకాలుగా ఆర్థికంగా ఖర్చుచేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు కూడా ఈ విషయంలో దిక్కులు చూడాల్సిన రోజులు దాపురించాయి.

అన్నదాత పరిస్థితి ఆగమ్యగోచరం

ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలకోసం పెట్టుబడులు పెట్టాలి. వ్యవసాయ పంట భూములను చదును చేసి, దుక్కి దున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తుంది. ఇప్పటికే వ్యవసాయ దారులు దుక్కులు దున్నుకొని విత్తనాల కొనుగోలు వంటి పనులు ప్రారంభించారు. కనీసం ఎకరాకు రూ.30వేలు అవసరం. ఐదెకరాలున్న రైతు దాదాపు రూ. లక్షకు పైగా డబ్బులు ఖర్చు చేయాలి. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తున్నా అది సరైన సమయానికి చేతికందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా బ్యాంకు రుణాలకోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే, మరోవైపు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అటు పిల్లల చదువులకు ఇటు వ్యవసాయ పెట్టుబడికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు, మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారంగా బడి ఫీజులు

గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలో ఫీజులు కొంచెం తక్కువగా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లోని స్కూళ్లలో మాత్రం ఎక్కువగానే ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ.25 వేలు, ప్రైమరీకి రూ.30 వేలు, హైస్కూల్‌కి రూ.40వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఏటా 10 నుంచి 20 శాతం మేర పెరుగుతున్న ఫీజులకు తల్లిదండ్రులకు ఆర్థిక భారం ఎక్కువవుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్ బ్యాగులు, స్టడీ మెటీరీయల్ ఇతర ఖర్చులతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఖర్చులు తప్పవు



జూన్ వచ్చిందంటే చాలు. పెట్టుబడికి, పిల్లల చదువులకు ఖర్చులు తప్పక పెట్టాల్సిందే. ఒక వైపు చదువులకు, మరో వైపు పంట పెట్టుబడులకు ఆర్థిక భారం సమస్యగా మారింది. ఇలా రెండు వైపుల ఒకే సారి ఒకే నెలలో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి రావడంతో సమస్యలు పెరుగుతున్నాయి.

– ఆశన్న, రైతు, హస్నాబాద్

వెంటనే నిర్మాణ పనులు చేపట్టండి



కొత్లాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్‌లు

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తులసిరామ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రాంపూర్‌తండా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సిరెడ్డి, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, నారాయణ, బంధ్యానాయక్, భీములు, మోహన్, నరహరి, ఆశప్ప, రమేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజాల్లోకి తీసుకెళ్లాలని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ పేర్కొన్నారు. శనివారం తాండూరు మండలం కొత్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఎంపీడీఓ విశ్వప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ..తాండూరు మండలానికి 700కు పైగ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చెన్‌గేస్‌పూర్ గ్రామంలో 144 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారన్నారు. వెంటనే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. బిల్లుల విషయంలో దళారులను నమ్మొద్దని ఎవరికి కూడా డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ చైర్మన్ నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచు సాయిలు, నాయకులు పూజారి మల్లుస్వామి, వెంకటప్ప, రాజు, పుట్యానాయక్, శంషోద్దీన్, రమేశ్, వెంకటప్పలు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌కు తగ్గిన ధాన్యం

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం ధాన్యం రాక పూర్తిగా తగ్గిపోయింది. వేలల్లో వచ్చే ధాన్యం సంచులు రెండంకెలకు పడిపోయింది. 1010 రకం ధాన్యం గత వారం 1,045 బస్తాలు రాగా ఈ వారం 93 బస్తాలు వచ్చాయి. క్వింటాల్‌కు రూ.1,700, రూ.1,800, రూ.1,850 వరకు అమ్మకాలు జరిగాయి. ఇప్పటి వరకు క్వింటాల్‌కు రూ వెయ్యి ధర తగ్గిందని రైతులు వాపోయారు. అలాగే సోనారకం వడ్లు 55 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 1,700, రూ. 2,100, రూ.2,125 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ వివరించారు. మొక్కజొన్న గత వారం 2,358 బస్తాలు రాగా ఈ వారం కేవలం 121 బస్తాలు వచ్చాయి. క్వింటాల్‌కు తక్కువగా రూ.1,850, ఎక్కువగా రూ. 2,220 వరకు ధర పలికిందని ఏఎంసీ కార్యదర్శి తెలిపారు.

పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న అబ్దుల్ ఖాలీద్

బషీరాబాద్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని బషీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ ఖాలీద్ అన్నారు. మైల్వార్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీగా మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలో కొనసాగుతున్న తనకు ఈసారి కాంగ్రెస్ తరఫున జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో న్యాయం జరుగుతుందని విశ్వాసం వెలిబుచ్చారు.

రైతులకు అందుబాటులో ఉండండి

తాండూరు రూరల్: నిత్యం గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో ఏవో, ఏఈ వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ..ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని ఫార్మర్ రిజిస్ట్రీ చేయించాలన్నారు. సీజన్ సందర్భంగా పొలాల్లోకి వెళ్లి సూచనలు ఇవ్వాలని ఏఈవో అను ఆదేశించారు. ఏవోలు కొమరయ్య పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: సర్కార్ బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సరస్వతి పూజ, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడులకే పంపించాలని సూచించారు. విద్యే ప్రగతికి మూలాధారమని, అందుకు ప్రతి ఒక్కరూ చదువుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు పాలుపంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రాథమిక దశనుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని సాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, ఏపీసీ చైర్‌పర్సన్ సుమతమ్మ, గ్రామస్తులు చెన్నయ్య, రామస్వామి, పాండుగౌడ్, నర్సింహులు, శివ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పట్లోల్ల రాంరెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ, గ్రామస్తులు మల్లేశ్, రాజేందర్ ఒక ఫ్యాన్, దేశ నాయకుల ఫొటో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరీ బాధాకరం

- రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదు
- కార్మికుల కష్టాలు పట్టని సర్కారు
- నిరసనగా జులై 9న దేశవ్యాప్త సమ్మె
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ వెల్లడి



సమ్మెనోటీస్ అందజేస్తున్న కార్మిక నాయకుడు శ్రీనివాస్

బషీరాబాద్: గ్రామ పంచాయతీలో కార్మికులకు రెండు నెలలుగా జీతభత్యాలు చెల్లించకుండా సర్కారు వెట్టిచాకిరీ చేయించుకోవడం బాధాకరమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాస్ మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా జులై 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలతో సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం బషీరాబాద్ వచ్చిన ఆయన కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయ అధికారికి సమ్మెనోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..పంచాయతీ కార్మికులకు యేడాదిగా వేతనాలు చెల్లింపులో జాప్యం చేస్తున్నారన్నారు. అయితే కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెలా వేతనాలు క్రమం తప్పకుండా చెల్లిస్తామని ప్రకటించి మాట తప్పారని విమర్శించారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో 51 ద్వారా మల్టీపర్పస్ వర్కింగ్ విధానం మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51వేల మంది కార్మికులకు బీమా సౌకర్యం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దశాబ్దాలుగా సేవచేసే వారికి ప్రభుత్వాలు కనీసం వేతన చట్టబద్ధత కల్పించలేక పోయాయని విమర్శించారు. మురుగు కాల్వలు శుభ్రం చేస్తూ, రోడ్లు శుభ్రం చేసే కార్మికుల జీవితాలు దుర్భరంగా మారినా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందన్నారు. కార్మికుల డిమాండ్‌ల పరిష్కారంకోసం దేశవ్యాప్తంగా జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మండల కార్మికుల సంఘం అధ్యక్షుడు శ్యామప్ప, కార్మిక నాయకులు చందు, భాస్కర్, లక్ష్మి, జగ్గమ్మ, భీమమ్మ, మొగులప్ప లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



కూరగాయలను పరిశీలిస్తున్న కమిషనర్ బలరాం నాయక్

కొడంగల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను శనివారం కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురుకుల పాఠశాలలోని మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. మెస్‌లో కూరగాయలు, నిత్యావసర సరుకులను గమనించారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలైందని, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. గురుకుల పాఠశాలలో సిబ్బంది, విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని, మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతిరోజు వండిపెట్టాలని మెస్ నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రతీరోజు వంట చేయాలన్నారు. శుద్ధి చేసిన తాగునీటిని విద్యార్థులకు సరఫరా చేయాలన్నారు. అనంతరం గురుకుల పాఠశాల అధ్యాపకులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి



ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం సుభాశ్‌దంపతులను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

దస్తగిరిపేట్ హెచ్‌ఎంకు అభినందన

తాండూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరని రిటైర్డ్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాశ్‌కు పలువురు రిటైర్డ్ హెచ్‌ఎంలు సన్మానించారు. శనివారం పట్టణ శివారులోని రసూల్‌పూర్ హనుమాన్ దేవాలయం వద్ద హెచ్‌ఎం సుభాశ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల మాట్లాడారు. ఆయన ముక్కుసూటి మనిషి అని, సేవాగుణం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. గతంలో చింతమణిపట్నం, మిట్టబాసుపల్లి, దస్తగిరిపేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారన్నారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానానికి ఆయన రూ.11వేలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎంపీడీఓ రతన్‌సింగ్, ఉపాధ్యాయులు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని బాపల్లితండాలో శనివారం పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. తండాలోని తులసీబాయికి రూ. 60వేలు, పవార్ రమణీబాయికి రూ. 2.50లక్షలు అందజేశారు. పేద, దళిత, గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న గొప్పసాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మోత్యానాయక్, సంతోష్‌నాయక్, మహేందర్‌సింగ్, హన్మ్యా, దాస్యా, శివరాం, రూప్‌సింగ్, హన్మ్యా, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణానికి కృషి



ప్రొసీడింగ్ వివరాలను తెలియజేస్తున్న గుల్షన్

కొడంగల్ రూరల్: పట్టణంలో షాదీఖానా భవన నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ శనివారం పార్టీ ఇన్‌చార్జ్, బహదూర్‌పుర ఎమ్మెల్యే ముబీన్ సహబ్‌ను ఆయన నివాసంలో కలిసి కోరారు. కొడంగల్ షాదీఖానా భవన నిర్మాణానికి రూ.2.50కోట్ల నిధులు మంజూరయ్యాయని జారీ చేసిన ప్రొసీడింగ్ వివరాలు తెలియజేసినట్లు గుల్షన్ తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీలతో మాట్లాడి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని గుల్షన్ పేర్కొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఈఓ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట భవానిమాత దేవాలయం, నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి రామాలయం అభివృద్ధికి రూ.50లక్షల చొప్పున కోటిన్నర నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా గదులు, గాలిగోపురం, మండపం నిర్మిస్తామన్నారు. భవానిమాత దేవాలయంలో మౌలిక వసతులు, ఆలయ ప్రహరీ నిర్మాణం, రామాలయంలో భక్తులకు అవసరమైన సదుపాయాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. దాతలు సహకరించి దేవాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆలయాల చైర్మన్‌లు, నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, భవానిమాత దేవాలయ చైర్మన్ ముత్యాలరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి శ్రీశైలం, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, నవీన్‌రెడ్డి, బుడ్డ నర్సింహ, అశోక్, రమేశ్, ఈఓ శివకుమార్, ఏఈ తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సొంత భవనాలు

- నిర్మాణ పనులకు రూ.2 కోట్లు మంజూరు
- వచ్చే నెలాఖరు వరకు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఈర్లపల్లిలో స్లాబ్ వరకు వేసిన అంగన్‌వాడీ భవనం

దౌల్తాబాద్: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. దీంతో కొన్ని అద్దె ఇళ్లలో మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలల అదనపు గదుల్లో అరకొర వసతుల మధ్య కొనసాగేవి. ఆయా కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఇబ్బందిగా ఉండేది. దీన్ని దృష్టిలో ఉంచుకొని నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మండలంలోని పది అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవన నిర్మాణాలకు రూ.2 కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జారీ అయ్యాయని ఏఈ నాగేందర్ తెలిపారు. వచ్చే నెలాఖరు వరకు నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకరావాలని అధికారులు చెబుతున్నారు.

రూ.20లక్షల చొప్పున..

ఉపాధి హామీతో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ 15వ ఆర్థిక సంఘం ద్వారా ఒక్కో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయని ఏఈ తెలిపారు. మండలంలో తిమ్మాయిపల్లి, గోకఫసల్‌వాద్, కొడీద్, నీటూరు, దేశాయిపల్లి, ఈర్లపల్లి, నందారం, సురాయిపల్లి, దౌల్తాబాద్–3, దౌల్తాబాద్–4 అంగన్‌వాడీకేంద్రాలకు మంజూరయ్యాయి. ఇందులో కొడీద్, తిమ్మాయిపల్లి, గోకఫసల్‌వాద్‌లో స్లాబ్ వరకు పనులు చేపట్టారు. ఈర్లపల్లిలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిందని పేర్కొన్నారు. మిగిలిన భవనాలు త్వరలో ప్రారంభిస్తామని వివరించారు.

సత్వరమే పూర్తి చేస్తాం

మండలంలో 10 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయి. వాటిలో నాలుగు ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. మిగిలినవి ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు సూచించాం. వాటిని త్వరలో ప్రారంభించి సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేందర్, ఏఈ, దౌల్తాబాద్